క్లుప్తంగా

'జగనన్నకు చెబుదాం'కు అధికారుల డుమ్మా



అరకొర అధికారులతో జగనన్నకు చెబుదాం నిర్వహిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తున్న 'జగనన్నకు చెబుదాం' ఫిర్యాదుల కార్యక్రమానికి మండల అధికారులు డుమ్మా కొడుతున్నారు. ప్రభుత్వ ఆశయానికి తూట్లు పొడిచి కార్యక్రమాన్ని తూతూమంత్రంగా నిర్వహించి మమ అనిపిస్తున్నారు. సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వ్యవసాయ శాఖ, గృహ నిర్మాణ శాఖ, ఐసీడీఎస్, వెలుగు, వైద్యారోగ్య శాఖ, పంచాయతీ రాజ్, ఉపాధి హామీ పథకానికి సంబంధించి అధికారులు తప్ప, మిగతా శాఖల అధికారుల జాడ కరువైంది. ప్రస్తుత సీజన్‌లో అవసరమైన విద్యుత్, విద్య, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు హాజరవ్వకపోవడంపై అర్జీదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయం సందర్శన



సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కవిటి: మండలంలోని లండారిపుట్టుగ సచివాలయాన్ని ఎమ్మెల్సీ నర్తు రామారావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించారు. జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమంలో వస్తున్న ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు.

సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు

వజ్రపుకొత్తూరు: విధి నిర్వహణలో చేసిన సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు లభిస్తుందని వక్తలు అన్నారు. కాశీబుగ్గ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి అనంతగిరి సెక్టార్ సూపర్‌వైజర్‌గా సేవలు అందించి, బదిలీపై అనకాపల్లి వెళ్లిన సూపర్‌వైజర్ సంతోషిని సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంతోషిని మాట్లాడుతూ ఉద్యోగికి ఒక ప్రదేశం నుంచి మరో ప్రాంతానికి బదిలీ అనేది విధి నిర్వహణలో భాగమన్నారు. ఉద్యోగిగా ఈ ప్రాంతంతో చక్కని అనుబంధం ఏర్పడిందని తెలియజేశారు. కాశీబుగ్గ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఉద్యోగుల తో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు పూర్తి సహకారం అందించడం ఎప్పటికీ మరువలేనిదన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కవిటి: మండలంలోని నెలవంక పంచాయతీ కొమ్ముపుట్టుగకు చెందిన కేన్సర్ బాధిత కళాకారుడు బైరెడ్ల రామారావుకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఫౌండేషన్ సభ్యులు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి వెళ్లి బాధిత కళాకారుడి యోగ క్షేమాలు సభ్యులు తెలుసుకున్నారు. తమ వంతుగా సేకరించిన రూ.10,000 నగదును అందించారు. మిగిలిన సంఘాలు కూడా ఉదారంగా స్పందించి కళాకారుడిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

'సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలి'

సోంపేట: ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల భవనాల సమస్యలు పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కేజీబీవీ డైరెక్టర్ బొడ్డ శ్రీనివాసరావును నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ కోరారు. ఈ మేరకు విజయవాడలో శ్రీనివాసరావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అవసరమైన పాఠశాలలకు ప్రహరీలు, అదనపు భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ లభించినట్లు సాయిరాజ్ తెలిపారు.

ఆర్టీసీ మేనేజర్‌గా సంతోష్

కాశీబుగ్గ: పలాస ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పినకాన సంతోష్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నాలుగేళ్లుగా పలాస డిపో మేనేజర్‌గా పనిచేసిన వేదుళ్ల శ్రీనివాసరావు బదిలీ అయ్యారు. దీంతో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉన్నటువంటి సంతోష్‌కు ఇదివరకు ఇన్‌చార్జి డిపో మేనేజర్‌గా బాధ్యతలు అప్పగించినప్పటికీ, ప్రస్తుతం పూర్తిస్థాయిలో బాధ్యతలు చేపట్టారు.

ఎంపీడీవోగా తిరుమలరావు

మందస: మండల ఎంపీడీవోగా వాయలపల్లి తిరుమలరావు సోమవారం పూర్తిస్థాయిలో బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల పదోన్నతులు పొందినవారిలో తిరుమలరావు కూడా ఉన్నారు. మందస ఎంపీడీవో కార్యాలయంలోనే ఈయన ఏవోగా పని చేస్తున్నారు. పదోన్నతి పొందిన ఆయన బాధ్యతలు చేపట్టారు.

కవిటి తహసీల్దార్‌గా శేఖర్

కవిటి: మండల తహసీల్దార్‌గా పార్వేలు శేఖర్‌ను నియమిస్తూ కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇతను కలెక్టర్ కార్యాలయం హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. ఇదివరకు కవిటి తహసీల్దార్‌గా పనిచేసిన రాచర్ల అప్పలరాజు గత నెల రోజులుగా దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. అతడిని ఎల్ఎన్‌పేట మండలానికి బదిలీ చేశారు.

ప్రకృతికి ప్రణామం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని వక్తలు పేర్కొన్నారు. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా అవగాహన ర్యాలీలు, సమావేశాలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలని సూచించారు. పర్యావరణానికి హాని మానవ జీవనానికి విఘాతమని హెచ్చరించారు. – సాక్షి నెట్‌వర్క్



ఇచ్ఛాపురం: మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి తదితరులు



కోటబొమ్మాళి: కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న న్యాయవాదులు



కాశీబుగ్గ: మొక్కలు నాటుతున్న కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి, సీఐ శ్రీనివాసరావు తదితరులు



టెక్కలి: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి తదితరులు



మందస: అంబుగాంలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు



కంచిలి: తలతంపరలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



సోంపేట: మానవహారం చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ సంఘం నేతలు



వజ్రపుకొత్తూరు: ప్రతిజ్ఞ చేస్తున్న స్వయం శక్తి సంఘాల మహిళలు



ఇచ్ఛాపురం రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



టెక్కలి: కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న జూనియర్ సివిల్ జడ్జి తదితరులు



టెక్కలి: శాఖా గ్రంథాలయంలో మొక్కలు నాటుతున్న చిన్నారులు



కాశీబుగ్గ: మొక్కలు అందజేస్తున్న ఉద్యోగులు



వజ్రపుకొత్తూరు రూరల్: పెద్దబొడ్డపాడులో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

గడప గడపలో సంతోషాలు

● జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



సోంపేట: లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులు

సోంపేట: వైఎస్సార్‌సీపీ హయాంలో రాష్ట్రంలోని ప్రతి గడపలో సంతోషాలు వెల్లివిరుస్తున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని కొర్లాం సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలను తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర్ రెడ్డి, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బతకల మోహనరావు, పార్టీ నాయకులు తామాడ మోహన్, మర్ల శంకరరావు, కోట్నీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో మేలు

కంచిలి: వైఎస్సార్‌సీపీ హయాంలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతోందని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండల కేంద్రం కంచిలి-2 సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బలియాపుట్టుగ, పాత్రపడ, చిన్నపాత్రపడ గ్రామాల్లో పర్యటించి, నాలుగేళ్లుగా ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్లు జోగేశ్వర చౌదరి, సీహెచ్ రాజు, డొక్కరి కొగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో పల్లెలు



బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

● మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

మందస: వైఎస్సార్‌సీపీ హయాంలో రాష్ట్రంలోని పల్లెలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని పితాతొళి జంక్షన్(చాకిరేవు గెడ్డ) వద్ద నిర్మించిన ప్రయాణికుల విశ్రాంతి భవనం, బస్ షెల్టర్‌ను సోమవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శరవేగంగా మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలియజేశారు. పల్లెలు సర్వాంగసుందరంగా కనిపిస్తున్నాయన్నారు. మారుమూల ప్రాంతాలకు సైతం రహదారులు నిర్మించబడ్డాయన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం పితాతొళిలో జరుగుతున్న బోయిరమ్మతల్లి, గట్టుపోలమ్మతల్లి ఉత్సవాల్లో పాల్గొన్నారు. సర్పంచ్ చింతాడ సుధ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, జెడ్పీటీసీ నవర చంద్రమ్మ, ఎంపీటీసీ మట్ట లక్ష్మమ్మ, సచివాలయాల మండల కన్వీనర్ చింతాడ గణపతి, మాజీ సర్పంచ్ బాడ జగన్నాయకులు, సాప రామారావు, ఫీల్డ్ అసిస్టెంట్ చింతాడ చలపతి, శిస్టు బాపూజీ, ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ స్పందనకు 30 వినతులు



వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 30 వినతులు వచ్చాయని అధికారులు తెలియజేశారు. దీనిలో భాగంగా టెక్కలి కాటాబందలో వివిధ సామాజిక సంఘాల భవనాలకు కేటాయించిన స్థలంలో ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన సొండి, పట్టుశాలి, బ్రాహ్మణ, ముస్లిం తదితర సామాజిక వర్గాలు నాయకులు ఫిర్యాదు చేశారు. కోటబొమ్మాళి మండలం కొప్పలపేట గ్రామంలోని చెరువు ఆక్రమణలకు గురైందని, తక్షణమే ఆక్రమణలు తొలగించాలని కణితి నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. టెక్కలి మండలంలోని దాలిచెరువు గట్టును పటిష్టం చేయాలని బన్నువాడ గ్రామానికి చెందిన రైతు పోలాకి వాసుదేవరావు విన్నవించారు. తమ గ్రామంలోని పుల్ల మామిడి చెరువులో ఉపాధి పనులు కల్పించాలని చిన్నభీంపురం గ్రామానికి చెందిన గిరిజనులు కోరారు. చింతలగార సమీపంలోని సర్వే నంబర్ 8/2లో తప్పుడు రిజిస్ట్రేషన్లపై చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని విన్నవించారు. ఎన్టీఆర్ కాలనీలో తమకు కేటాయించిన స్థలం ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ధవళ లోలాక్షమ్మ ఫిర్యాదు చేశారు.

పరామర్శ

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి 18వ వార్డు కౌన్సిలర్ చిడిపోతు జగన్నాయకులు, 23వ వార్డు మాజీ కౌన్సిలర్ బాసిపార్వతీశం కుటుంబాలను మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి సోమవారం పరామర్శించారు. 18వ వార్డు కౌన్సిలర్ తండ్రి చిడిపోతు జోగయ్య, 23వ వార్డు మాజీ కౌన్సిలర్ తల్లి బాసి దాలమ్మలు ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న చైర్‌పర్సన్ ఇరు కుటుంబాలను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఆమెతో పాటు 1వ వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్, 10వ వార్డు కౌన్సిలర్ పి.తేజేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రకాషరావు పట్నాయక్, నీలాపు ఢిల్లి తదితరులు ఉన్నారు.

టెక్కలి విజయాన్ని కానుకగా ఇద్దాం



మాట్లాడుతున్న దువ్వాడ వాణి

● వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి

సంతబొమ్మాళి: రానున్న ఎన్నికల్లో టెక్కలిలో ఘన విజయం సాధించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇద్దామని వైఎస్సార్‌సీపీ నాయకురాలు, టెక్కలి జెడ్పీటీసీ దువ్వాడ వాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల స్థాయి పార్టీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అందరి సూచనలు, సలహాలతో పార్టీని ముందుకు తీసుకెళ్తానని తెలియజేశారు. నాయకులు, కార్యకర్తల సమక్షంలోనే సమస్యలు పరిష్కరించి అందరికీ న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. మండలంపై పూర్తి అవగాహన ఉందని, సమన్వయంతో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానని పేర్కొన్నారు. ప్రభుత్వంపై టీడీపీ నాయకుల విమర్శలను తిప్పికొట్టాలని సూచించారు. పార్టీలో ఎటువంటి గ్రూపులు లేవని, అందరం ఒకటేనని ఆమె వెల్లడించారు. జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి, ఎంపీపీ రాజేశ్వరి, పీఏసీఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సంపతిరావు రాఘవరావు, ఎం.అప్పారావు, ఎస్.భీమారావు, పి.రామ కృష్ణ, పి.మేనకేతన రెడ్డి, ఎస్.రామిరెడ్డి, కె.సతీష్, ఎన్ని మన్మథరావు, శ్రీరంగం వీరాస్వామి పాల్గొన్నారు.

'అధికారులు బాధ్యత వహించాలి'



బాధితుడిని పరామర్శిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కాశీబుగ్గ: ఉద్దాన ప్రాంతంలో ఎలుగుబంట్ల దాడులకు అటవీశాఖ అధికారులు బాధ్యత వహించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహన్‌రావు అన్నారు. వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి గ్రామానికి చెందిన జీడి రైతు సూరడ లోకనాథం సోమవారం ఎలుగుబంటి దాడిలో గాయాలపాలవ్వడంతో, పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఆయనను వివిధ ప్రజా సంఘాలు, వామపక్ష నాయకులు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలుగుబంట్లు నిత్యం దాడులు చేస్తున్నా, అటవీశాఖ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఉద్దాన ప్రాంతంలో ఎలుగుబంట్లు గ్రామాలు, తోటల్లోకి రాకుండా ఎందుకు నివారణ చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. ఆయనతో పాటు అఖిల భారత కిసాన్ మహాసభ జిల్లా కన్వీనర్ మద్దిల రామారావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, జీడి రైతు సంఘం కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, కుత్తమ వినోద్‌కుమార్, ప్రగతి శీల కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పుచ్చ దుర్యోధన, ఆదినారాయణ, రామకృష్ణ, తమ్మినాన భాస్కరరావు, కె.బాలాజీ, కె.హేమసూదన్ తదితరులు ఉన్నారు.

'పచ్చిరొట్ట విత్తనాలు వినియోగించుకోవాలి'

ఇచ్ఛాపురం రూరల్: ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి పిరియా శ్రీదేవి సూచించారు. మండలంలోని ఈదుపురం రైతు భరోసా కేంద్రంలో రైతులతో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పచ్చిరొట్ట సాగు ద్వారా భూములు సారవంతమవుతాయని తెలియజేశారు. రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలతో పాటు వరి విత్తనాలు కూడా ఇవ్వడం జరుగుతోందన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు సోనియా, భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు శాలువాలు పంపిణీ

కంచిలి: కుంబరినౌగాం, సువాగడ పంచాయతీల పరిధిలో నివసిస్తున్న 400 మంది గిరిజనులకు దివంగత బెండి ప్రయాగమూర్తి జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు శాలువాలు సోమవా రం పంపిణీ చేశారు. వీటిని స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి చేతులమీదుగా అందజేశారు. మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవపాత్రో, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ధర్మారావు, కృష్ణారావు, కుంబరినౌగాం సర్పంచ్ హరిబంధు జన్ని, నువాగడ సర్పంచ్ సబితా గొమాంగో పాల్గొన్నారు.

త్వరితగతిన నాడు-నేడు పనులు



సమీక్ష నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం:

మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని హెచ్ఎంలు, సచివాలయ సిబ్బందికి మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నాడు-నేడు ఫేజ్-2 పనులు జరుగుతున్న పాఠశాలల హెచ్ఎంలు, ఆయా సచివాలయాల సిబ్బందితో సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. పనుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అయితే సకాలంలో కూలీలు, మేస్త్రీలు రాకపోవడంతో పనులు పెండింగ్‌లో ఉన్నాయని సచివాలయం సిబ్బంది తెలిపారు. ఈ విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంఈవో కె.అప్పారావు తెలియజేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ టీఎంసీకి సన్మానం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మెప్మా టీఎంసీగా విధులు నిర్వహించి, ప్రస్తుతం డిస్ట్రిక్ మిషన్ కో-ఆర్డినేటర్‌గా పదోన్నతిపై వెళ్లిన బోర భాస్కరరావును మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్, నూతన టీఎంసీ పిన్నింటి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నౌపడ ఎస్ఐగా కిషోర్ వర్మ

సంతబొమ్మాళి: నౌపడ ఎస్ఐగా పి.కిశోర్‌వర్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మన్యం జిల్లా దోనుబాయి స్టేషన్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ లావణ్య మన్యం జిల్లాకు బదిలీ అయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సోంపేట: బారువ-సోంపేట రోడ్డుపై కారు బోల్తా పడిన ఘటనలో కంచిలి మండలం కుత్తుమ గ్రామానికి చెందిన గుడియా కిరణ్, కీలు జనార్దనలు గాయపడ్డారు. బారువ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత మందస అమ్మవారి ఉత్సవాలు చూసి కుత్తుమ గ్రామానికి కారులో వస్తుండగా వాహనం అదుపు తప్పి బారువ సమీపంలో పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. దీంతో అందులో ఉన్న ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసినట్టు పోలీసులు చెప్పారు.